www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

నేటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాలలకు గురువారం నుంచి వేసవి సెలవులను ప్రకటించింది. తిరిగి జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ విద్యా సంవత్సరానికి బుధవారం చివరి రోజు కావడంతో విద్యార్థులంతా టాటా చెప్పుకుంటూ ఇంటికి బయలుదేరడం కనిపించింది. అలాగే గురుకుల విద్యాలయాలు, కేజీబీవీలు, ఎంజేపీల నుంచి విద్యార్థులు తమ సామగ్రిని ఆటోలో వేసుకుని ఇంటికి తీసుకువెళ్లారు. ఇక 45 రోజుల పాటు విద్యార్థులంతా ఒత్తిడికి దూరంగా.. ఆటలకు దగ్గరగా గడపనున్నారు.





బాలికలదే పైచేయి

- టెన్త్ ఫలితాల్లో ఉత్తమంగా రాణింపు
- జిల్లాలో 87.04 శాతం ఉత్తీర్ణత
- రాష్ట్రంలో 7వ స్థానం.. 19,824 మంది పాస్

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో బాలికలదే పైచేయి అయింది. జిల్లాలో 11,413 మంది బాలురు పరీక్ష రాయగా 9,748 (84.41)మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 11,364 మంది పరీక్షకు హాజరుకాగా 10,076(88.67) మంది ఉత్తీర్ణులయ్యారు. కాగా జిల్లా వ్యాప్తంగా పరీక్షలకు హాజరైన వారిలో 19,824(87.04 శాతం) మంది విద్యార్థులు టెన్త్‌లో ఉత్తీర్ణత సాధించారు. తద్వారా రాష్ట్రంలో జిల్లాకు 7వ స్థానం దక్కింది. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పదో తరగతి ఫలితాలను బుధవారం ఉదయం విడుదల చేశారు. జిల్లాలో బాలురు కంటే బాలికలు అధికంగా ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది మార్చి 17 నుంచి ఈనెల 2వ తేదీ వరకూ పదో తరగతి పరీక్షలు జరిగిన సంగతి తెలిసిందే. ఈనెల 3 నుంచి 9వ తేదీ వరకూ జవాబుపత్రాల మూల్యాంకనం జరిగింది. గతంలో ఎప్పుడు లేని విధంగా పరీక్షలు పూర్తయిన 20 రోజుల్లో ఫలితాలు విడుదలయ్యాయి.

సాయివిజయ్‌కు 596 మార్కులు

పదో తరగతి ఫలితాల్లో అత్యధికంగా బొబ్బిలి అభ్యుదయ పాఠశాలకు చెందిన పక్కి సాయివిజయ్ 596 మార్కులు సాధించాడు. ఈ విద్యార్థి తండ్రి వెంకటరమణమూర్తి ప్రైవేట్ విద్యాసంస్థలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. తల్లి సాయిశ్రీకళ గృహిణి. అలాగే విజయనగరంలోని ప్రభాకర్ పాఠశాలకు చెందిన ఎస్‌ఎస్‌వీపీ లాస్యప్రియ 595 మార్కులు దక్కించుకున్నారు. విజయనగరం శ్రీచైతన్య పాఠశాలకు చెందిన డొంక హర్షిని కూడా 595 మార్కులు సాధించారు. కాగా జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన అత్యధిక విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించారు. భోగాపురం ఆదర్శ పాఠశాలలో చదివిన కోయ్య హరీష్ 593 మార్కులు, మెరకముడిదాం జడ్పీ పాఠశాలకు చెందిన సంగిరెడ్డి వివేక్ 593 మార్కులు, నెల్లిమర్ల ఎంజేపీబీసీ స్కూల్‌కు చెందిన మోహెర్ రేష్మకు 592 మార్కులు, బొబ్బిలి ఎంజేపీబీసీకి చెందిన చోడవరపు శివకు 592 మార్కులు, ఎల్.కోట మండలం కోట్యాడ జడ్పీ పాఠశాలకు చెందిన (మిగతా 4వ పేజీలో..)

ఆరేళ్లలో జిల్లాలో నమోదైన ఫలితాలు

ఏడాది	హాజరు	ఉత్తీర్ణత	శాతం
2019-20	30030	30030	100
2020-21	29368	29368	100
2021-22	29365	22758	77.50
2022-23	24040	18430	76.66
2023-24	23690	21752	91.82
2024-25	22777	19824	87.04



పాఠశాలల వారీగా ఫలితాలు

పాఠశాల పేరు	రాసినవారు	ఉత్తీర్ణులు	శాతం
ఎయిడెడ్	143	128	87.07
మోడల్‌స్కూల్స్	1158	1075	92.83
ఏపీఆర్‌ఎస్	161	160	99.38
ప్రభుత్వ పాఠశాలలు	685	478	69.78
కేజీబీవీ	971	890	91.66
ఎంజేపీబీసీ వెల్ఫేర్	410	396	96.59
మున్సిపల్	682	439	64.37
ప్రైవేటు	6314	6088	96.42
సోషల్ వెల్ఫేర్	559	485	86.76
గిరిజన సంక్షేమశాఖ	202	159	78.71


సాయివిజయ్ (596)


లాస్యప్రియ (595)


హర్షిని (595)


వివేక్ (593)

హమ్మయ్యా ఫోన్ అందింది

- ట్రేస్ చేసి బాధితులకు అందజేసిన పోలీసులు
- 264 సెల్‌ఫోన్ల విలువ రూ.42 లక్షలు

విజయనగరం క్రైం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకుని ఇబ్బందులు పడుతున్న బాధితులకు పోలీసులు ఊరట కల్పించారు. సెల్‌ఫోన్ దొంగలను ట్రేస్ చేసి వారి నుంచి ఫోన్లను స్వాధీనం చేసుకుని జిల్లా కేంద్రంలో భద్రపర్చారు. ఒకేసారి 264 మందికి బుధవారం అందజేశారు. వీటి విలువ దాదాపు రూ.42లక్షలు ఉంటుందని అంచనా వేశారు. మొబైల్స్‌ను ఎస్పీ వకుల్‌జిందాల్ బుధవారం జిల్లా పరిషత్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇకపై మొబైల్ పోగొట్టుకుంటే జిల్లా సైబర్ సెల్ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని, దగ్గరలోని పోలీసుస్టేషన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఫోన్లను ట్రాక్ చేసేందుకు ప్రత్యేకంగా మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం తీసుకొచ్చామని, ఫోన్ నంబర్ 89779 45606కు హాయ్ సందేశం పంపిస్తే చాలన్నారు. మెసేజ్ పంపిన మొబైల్‌కు ఒక గూగుల్ ఫారం వస్తుందని, ఆ ఫారాన్ని పూర్తి చేసి తిరిగి ఆ నెంబరుకు పంపినట్టయితే ఫిర్యాదు నమోదు చేసుకుని ట్రేస్ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ రూ.6 కోట్ల విలువైన 3,300 మొబైల్ ఫోన్లను ట్రేస్ చేసి బాధితులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, డీఎస్పీ శ్రీనివాసరావు, సైబర్ సెల్ సీఐ డి.శ్రీనివాసరావు, సీఐలు లీలారావు, ఎస్ఐ నసీమాబేగం తదితరులు పాల్గొన్నారు.


బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఎస్పీ



ఎస్.కోట - బొడ్డవర రోడ్డులో నిలిచిన టాక్టర్లు ఇవి. ఎక్కడ నుంచో అక్రమంగా తవ్విన కంకరను తీసుకొచ్చాయి. సమీప పొలంలో వేసేందుకు ఒకదాని వెనక ఒకటి ఆగాయి. అదివారం నుంచి పదుల సంఖ్యలో ఈ టాక్టర్లు కంకరతో పట్టపగలే తిరుగుతున్నాయి. విశాఖ నుంచి అరకు వెళ్లే ప్రధాన రోడ్డు కావడంతో నిత్యం ప్రజాప్రతినిధులు, అధికారులు తిరుగుతూ ఉంటారు. అయినా ఈ టాక్టర్లు ఎవరికీ కనిపించడం లేదు.

ఏ కన్నూ చూడదనా..!

- ఇష్టారాజ్యంగా మట్టి, కంకర తవ్వకాలు
- చెరువుల్లో ఎక్కడికక్కడే ఎక్సకవేటర్లు
- రోడ్లపై పరుగులు తీస్తున్న ట్రాక్టర్లు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లలో నష్టం

శృంగవరపుకోట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మూడేళ్ల క్రితం ఎస్.కోట మండలం కొత్తూరు, దాంపురం గ్రామాల పరిధిలోని భూములను లేఅవుట్‌గా మార్చారు. ఇందుకు ఎక్కడ నుంచో మట్టిని తీసుకొచ్చి కప్పారు. ఈ విషయం తెలిసి అధికారులు భూ బదలాయింపు చేయకుండా లేఅవుట్ వేసినందుకు జరిమానా, భూ బదలా యింపు రుసుం వసూలుకు నోటీస్‌లు జారీ చేశారు. రెండు శాఖల అధికారులు వారి నుంచి జరిమానాల వసూలుతో అప్పట్లో మట్టి, కంకర అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట పడింది. ఆ తర్వాత చర్యలు కొనసాగక పరిస్థితి మళ్లీ మామూలైపోయింది. రెండు నెలల నుంచి ఎక్కడబడితే అక్కడ మట్టి, కంకర తవ్వకాలు జరుగుతున్నాయి. ఎక్సకవేటర్‌లతో లోతుగా గుంతలు పెట్టేస్తున్నారు. రోజుకు ఒక్కో ఎక్సకవేటర్ 10 నుంచి 100 ట్రాక్టర్‌లకు కంకర, మట్టిని ఎత్తుతున్నాయి. వీటిని తీసుకొని పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్న తేడా లేకుండా రోడ్లపై ట్రాక్టర్లు పరుగులు తీస్తున్నాయి. ప్రధానంగా రోడ్ల పక్కనున్న పొలాలనే ఈ మట్టితో కప్పేస్తున్నాయి. అధికారులకు ఇదంతా కనిపిస్తున్నా చూసీచూడనట్లు నటిస్తున్నారు.

నిబంధనలు ఇలా..

ఒక చోట నుంచి మరో చోటుకు మట్టి తరలింపునకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. రెవెన్యూ, జలవనరుల, భూగర్భ గనుల శాఖ అధికారులను సంప్రదించాలి. వారిచ్చే కొలతల ప్రకారం మట్టి, కంకర తవ్వాలి. ఇలా కాకుండా ఎవరైనా మట్టి, కంకరను తవ్వేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. మట్టిని తవ్వే ఎక్సకవేటర్‌లు, తరలించేందుకు ఉపయోగిస్తున్న ట్రాక్టర్లు, ఇతర పనిముట్లను స్వాధీనం చేసుకోవాలి. చట్టానికి లోబడి జరిమానాలు వసూలు చేసిన తరువాత వీటిని తిరిగి యజమానులకు అప్పగించాలి. అలాగే లేఅవుట్ తీర్చిదిద్దేందుకు వేసిన మట్టిని క్యూబిక్ మీటర్లలో లెక్క కడతారు. ఎన్ని క్యూబిక్ మీటర్ల మట్టి, కంకర పొలంలో కనిపిస్తే ఆ ప్రకారం జరిమానా చెల్లించాల్సిందే.

ప్రభుత్వానికి దక్కని ఆదాయం

జిల్లాలో ప్రతి మండలంలోనూ అనధికార లేఅవుట్‌లున్నాయి. వాటికి అనుమతులు లేకుండా ఎక్కడెక్కడి నుంచో తీసుకొచ్చిన మట్టితో కప్పినవే. ఇటు మట్టికి, అటు భూబదలాయింపునకు జరిమానాలు వసూలు చేస్తే రూ.కోట్లలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. భూ బదలాయింపు చేయకపోవడంతో పాటు పంచాయతీకి వదలాల్సిన పది శాతం (మిగతా 4వ పేజీలో..)





ఈ ఫొటోలో ఉన్నది జిరాయితీ భూమేమీకాదు.. డిపట్టానే. సుమారు 2.80 ఎకరాలను తాజాగా మట్టితో కప్పేశారు. ఇందుకోసం దాదాపు వారం రోజుల పాటు విశాఖ-అరకు రోడ్డులో ట్రాక్టర్లు తిరిగాయి. ప్రభుత్వానికి పైసా చెల్లించకుండానే వందల క్యూబిక్ మీటర్ల మట్టిని ఎక్కడి నుంచో తీసుకొచ్చేశారు.

పర్యాటకులపై కాల్పులు హేయమైన చర్య

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా బైసరన్, పహల్గామస్‌లో విహరిస్తున్న పర్యాటకులు, స్థానికులపై మంగళవారం జరిగిన ఉగ్రవాదుల దాడి అత్యంత హేయమైన చర్య అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ దాడిని ప్రజా స్వామ్యవాదులందరూ ఖండించాలన్నారు. కాల్పుల్లో ఇద్దరు విదేశీయులతో పాటు 28 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని, అనేక మంది తీవ్రగాయాలతో నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.


నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ

పహల్గాం ఉగ్రదాడి ఘోరం

- టీడీపీ, జనసేన, బీజేపీ, ప్రజా సంఘాల భారీ ర్యాలీ

విజయనగరం రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): అమాయక పౌరులపై ముష్కరులు దాడులకు పాల్పడడం హేయమైన చర్య అని, ఈ ఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాలని టీడీపీ, జనసేన, బీజేపీతో పాటు ప్రజా సంఘాలు, దళిత సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ముక్త కంఠంతో నినదించాయి. పహల్గాంలో ఉగ్రదాడిపై ఆందోళన వ్యక్తం చేస్తూ కోట జంక్షన్ నుంచి బుధవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ డీసీసీబీ, మూడులాంతర్లు, పైడి మాంబ ఆలయం, గంటస్తంభం మీదుగా కన్యకాపర మేశ్వరీ ఆలయం వరకూ సాగింది. ర్యాలీని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్విని, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేశ్వర్మ ప్రారంభించారు. అనంతరం కోట జంక్షన్‌లో మాట్లాడారు. ఉగ్రదాడిని దారుణమైన సంఘటనగా పేర్కొన్నారు.

పదిలో మనోళ్లు మెరిశారు

ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. అనేక మంది విద్యార్థులు 90 శాతానికి పైగా మార్కులు తెచ్చుకున్నారు. వీరిలో ఎక్కువ మంది 590కి పైగా మార్కులు సాధించడం గమనార్హం. కొన్ని ప్రభుత్వ పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించాయి.

● ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంచి మార్కులు


మిఠాయి తినిపిస్తున్న ప్రిన్సిపాల్ ఉషారత్నకుమారి

వీరఘట్టంలో...

వీరఘట్టం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల, గంగంపేటలోని జీటీడబ్ల్యువో హైస్కూల్, నీలానగరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీ విద్యార్థిని గంట్యాడ నందిని 582 మార్కులు సాధించింది.


నాగతేజ | లోహిత్ | తోట సంజన


పి.జెస్సిక | పప్పల చక్రి | భోగి అంజలి

పార్వతీపురంలో...

పార్వతీపురం టౌన్/ బెలగాం/ రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఎంఎం పాఠశాల విద్యార్థినులు కె.రేష్మ, ఎం.దివ్యమణిలకు 580 చొప్పున మార్కులు వచ్చాయి. కొత్త పోలమ్మ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.చక్రికి 582, ఎ.లీలాప్రసన్నకు 580 మార్కులు వచ్చాయి. స్థానిక డీవీఎం మున్సిపల్ పాఠశాల విద్యార్థి దాసరి నాగతేజ 588 మార్కులు, బొండపల్లి రోహిత్ 585, తోట సంజన 584 మార్కులు పి.జెస్సిక 582 మార్కులు సాధించింది. పెద్దబండపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని భోగి అంజలి 587 మార్కులు సాధించింది.

కురుపాంలో...

కురుపాం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యారి పొన్నాడ ఈశ్వరరావు 583, మెరగల శశిశ్రీ 580 మార్కుల వంతున సాధించారు.


ఈశ్వరరావు, శశిశ్రీలను అభినందిస్తున్న హెచ్ఎం


సందీప్‌ను అభినందిస్తున్న ఎంఈవో

బలిజిపేటలో..

బలిజిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్ర జ్యోతి): పెదపెంకి పాఠశాలకు చెందిన కోట సందీప్ 587, నారన్నాయుడు వలస విద్యార్థిని ధరణి 585, ఎన్ఎస్ వలసకు చెందిన ఎ.కావ్య 583 మార్కులు సాధించారు. అజ్జాడ హైస్కూల్ నుంచి 19 మంది హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. అరసాడ జెడ్పీహెచ్ఎస్ నుంచి 21 మంది హాజరుకాగా... అందరూ ఉత్తీర్ణత సాధించారు. పెదపెంకిలో 31 మందికి 31 మంది పాసయ్యారు.


హిరణ్యకు స్వీటు తినిపిస్తున్న దృశ్యం

పాలకొండలో..

పాలకొండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దకాపువీధి హైస్కూల్‌లో కామిటిపల్లి హిరణ్య 581 మార్కులు సాధించింది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని పాలూరు నిఖిత 583 మార్కులు సాధించింది.


పాలూరు నిఖిత

గరుగుబిల్లిలో...

గరుగుబిల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బొంగు పవిత్ర 587 మార్కులు సాధించింది.


బొంగు పవిత్ర

సీతానగరంలో...

సీతానగరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో విద్యార్థి కె.సాయికుమార్ 580 మార్కులు సాధించాడు.


సాయికుమార్


ఎస్.మోహన్ | శివ | రేవంత్‌బాబు


లావణ్య | విష్ణువర్ధన్ | సీహెచ్.పావని

బొబ్బిలిలో...

బొబ్బిలి/ రూరల్/ ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సింహాల తోటలో గల ప్రభుత్వ బాలుర గురుకుల పాఠ శాల, కోమటిపల్లిలోని మహాత్మాజ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలు పదో తరగతి పరీక్షల ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాయి. బొబ్బిలి ఏపీఆర్ఎస్‌లో పి.ప్రకాశ్, వానపల్లి చరణ్ తేజలకు 588 చొప్పున మార్కు లు వచ్చాయి. కోమటిపల్లి గురుకుల పాఠశాల విద్యార్థి ఎస్.మోహన్ 591 మార్కులు సాధించారు. చోడవరపు శివ 592, పెంట రేవంత్‌బాబు 588, దేవవరపు సాయి దివాకర్ 581 మార్కులు సాధించారు. పక్కి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని లావణ్య 592 మార్కులు, పారాది ఉన్నత పాఠశాల విద్యార్థిని మీసాల విష్ణువర్ధన్ 584 పెంట జెడ్పీ పాఠశాల సీహెచ్ పావని 581 మార్కులు సాధించారు.


పి.ప్రకాశ్ | చరణ్‌తేజ

రామభద్రపురంలో...

రామభద్రపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కొట్టక్కి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి సామిరెడ్డి ధర్మతేజ 582 మార్కులు సాధించాడు.


ధర్మతేజ

సాలూరులో...

సాలూరు రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, మావుడి, మామిడిపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలు, బొడ్డవలస బీఆర్ అంబేడ్కర్ గురుకులం శతశాతం ఉత్తీర్ణత నమోదు చేశాయి. కొత్తవలసలో 63 మంది, మావుడిలో 33 మంది, మా మిడిపల్లిలో 26 మంది, బొడ్డవలసలో 67 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా..అందరూ ఉత్తీర్ణత సాధించారు. పురోహితునివలస ఆదర్శ పాఠశాల విద్యార్థి కె.యోగింద్రకు 588 మార్కులు వచ్చాయి.


యోగేంద్రకు స్వీటు తినిపిస్తున్న ప్రిన్సిపాల్ అంజలిదేవి


రుగడ జ్యోత్స్న | టి.మహిమ | సిరిచందన

మక్కువలో...

మక్కువ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని రుగడ జ్యోత్స్న 587 మార్కులు, ఎ.సిరిచందన 584 మార్కులు సాధించారు. శంబర జెడ్పీ పాఠశాల విద్యార్థిని టి.మహిమ 585 మార్కులు సాధించింది. వీరిని పాఠశాలల సిబ్బంది అభినందించారు.

మెరకముడిదాంలో...

మెరకముడిదాం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గర్భాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సంగిరెడ్డి వివేక్ 593 మార్కులు సాధించాడు. భైరిపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి తాడెల రేవంత్591 మార్కులు సాధించారు.


సంగిరెడ్డి వివేక్ | తాడెల రేవంత్

లక్కవరపుకోటలో..


జి.పూజిత


భాగ్యశ్రీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

లక్కవరపుకోట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కొట్యాడ హైస్కూల్‌కు చెందిన పెదిరెడ్ల భాగ్యశ్రీ 592 మార్కులు సాధించింది. జమ్మాదేవిపేటలో గల ఎంజేపీ పాఠశాల శతశాతం ఉత్తీర్ణత సాధించింది. జి.పూజిత 588 మార్కులు సాధించింది. ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని ఆర్.తేజ 583 మార్కులు సాధించింది. కస్తూరిబాగాంధీ పాఠశాలలో శతశాతం ఉత్తీర్ణత నమోదైంది.


పి.యశోద | ఎల్.శరణ్య | కె.యామిని

గజపతినగరంలో...

గజపతినగరం ఏప్రిల్ 23:(ఆంధ్రజ్యోతి): జిన్నాం జెడ్పీ పాఠశాల విద్యార్థిని పి.యశోద 591 మార్కులు, యామిని 581 మార్కులు సాధించారు. లోగిస జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎల్.శరణ్యకు 583 మార్కులు వచ్చాయి.

తెర్లాంలో...

తెర్లాం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పెరుమాళి మోడల్ స్కూల్ విద్యార్థిని నీహారిక 585 మార్కులు సాధించింది. ఆమెను ఉపాధ్యాయులు అభినందించారు.


నీహారిక


చరిష్మ

దత్తిరాజేరులో..

దత్తిరాజేరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): షికారుగంజి మోడల్ పాఠశాల విద్యార్థిని వి.చరిష్మ 585 మార్కులు సాధించింది.

మెంటాడలో...

మెంటాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): చల్లపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి గుడివాడ అఖిల్ 584 మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.


అఖిల్

వంగరలో...

వంగర, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీ విద్యార్థిని జి.కుమారి 584 మార్కులు సాధించింది. ఆమెను ఉపాధ్యాయులు అభినందించారు.


కుమారి

గుర్లలో...

గుర్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కెల్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎడ్ల యశ్వంత్ 580 మార్కులు సాధించాడు. అతనిని ఉపాధ్యాయులు అభినందించారు.


ఎడ్ల యశ్వంత్

డెంకాడలో...

డెంకాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అక్కివరం ఆదర్శ పాఠశాల విద్యార్థిని పతివాడ హేమవర్షిణి 588 మార్కులు సాధించింది. డెంకాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.వేగాదేవి 585, జొన్నాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పి.భానుప్రకాష్ 582 మార్కులు సాధించారు.


హేమవర్షిణి

గరివిడిలో..

గరివిడి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కోనూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని వై.జ్యోత్స్నకు పదో తరగతి పరీక్షల్లో 584 మార్కులు వచ్చాయి. తోండ్రంగి జెడ్పీ పాఠశాల విద్యార్థిని ఎం.శ్యామల 582 మార్కులు సాధించింది.


జ్యోత్స్న | ఎం.శ్యామల


లక్ష్మణరావు | నవదీప్ | కుమార్

రాజాంలో....

రాజాం రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పొగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన లావేటి లక్ష్మణరావు 588 మార్కులు, గోకా కుమార్ పదిలో 582 మార్కులు సాధించారు. డోలపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి డోల నవదీప్ 584 మార్కులు సాధించాడు.

పూసపాటిరేగలో..

పూసపాటిరేగ,ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): కోనాడ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన టి.సాహితి 586, రెల్లివలస జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నడుపూరి హాసిని 580 మార్కులు సాధించారు.


టి.సాహితి

ఎస్.కోటలో..

శృంగవరపుకోట రూరల్ ఏప్రిల్ 23 : మండలంలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు మంచి మార్కులు సాధించారు. తాటిపూడి గురుకుల పాఠశాల విద్యార్థిని జి.శ్రుతి 587 మార్కులు, జి.కీర్తన 582 మార్కులు, కొట్టాం ఉన్నత పాఠశాల విద్యార్థిని రోషిణి 588 మార్కులు సాధించారు. ఎస్.కోట బాలికోన్నత పాఠశాల విద్యార్థిని పల్లవీ ప్రియ 582కు మార్కులు వచ్చాయి.


శృతి | కీర్తన


రోషిణి | పల్లవీ ప్రియ



నెల్లిమర్లలో...

నెల్లిమర్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంజేపీ ఏపీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని లావేటి మెహెర్ రేష్మ 592 మార్కులు సాధించింది. రామతీర్థం ఉన్నత పాఠశాల విద్యార్థి పిల్లా మహేష్‌కు 586, ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని జి.భాగ్యశ్రీకి 580, రామతీర్థం పాఠశాల విద్యార్థి ఆర్.జ్ఞానేశ్వరరావుకు 585 మార్కులు వచ్చాయి.

● సతివాడ ఆదర్శ పాఠశాల విద్యార్థిని కె.వెన్నెలకు 580, మొయిద ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్.కృష్ణ వంశీ, వై.నిహారికలకు 580 మార్కులు వచ్చాయి. తంగుడుబిల్లి ఉన్నత పాఠశాలలో శత శాతం ఫలితలు వచ్చాయి.


మెహెర్ రేష్మ | పిల్లా మహేష్

జియ్యమ్మవలసలో...

జియ్యమ్మవలస, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పెదమేరంగి, పిప్పలభద్ర, పెదబుడ్డిడి హైస్కూళ్లు శతశాతం ఉత్తీర్ణత సాధించాయి. ఆర్ఆర్‌బీ పురం టీడబ్ల్యూఏహెచ్ స్కూల్ (బాలురు), టీకే జమ్ము టీడబ్ల్యూఏహెచ్ బాలికల స్కూల్ శత శాతం ఉత్తీర్ణత సాధించాయి. చినమేరంగి హైస్కూల్‌కు చెందిన పి.వర్ష 582 మార్కులు సాధించింది.

కొమరాడలో..

కొమరాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కోటిపాం హైస్కూల్, కొమరాడ ఏపీఈటీడబ్ల్యూఆర్ఎస్ (జి) శతశాతం ఉత్తీర్ణత సాధించాయి. కోటిపాం హైస్కూల్ విద్యార్థి కండ్రేగుల లోకేష్ 583, మాదలింగి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని మీసాల ఐశ్వర్య 582 మార్కులు సాధించారు.

సీతంపేటలో...

సీతంపేట రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి):సీతంపేట ఐటీడీఏ పరిధిలో గల 16 ఆశ్రమ పాఠశాలలు, 2 గురుకుల పాఠశాలలు శతశాతం ఫలితాలు సాధించాయి.

బాడంగిలో...

బాడంగి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) బాడంగి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆర్.కిరణ్, జి.మణికాంత్‌లు 581 చొప్పున మార్కులు సాధించారు.

చీపురుపల్లిలో...

చీపురుపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పెదనడిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.జోషినికి 588 మార్కులు వచ్చాయి. పీకే పాలవలస విద్యార్థిని జి.పల్లవికి 581 మార్కులు లభించాయి.

భోగాపురంలో...

భోగాపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థి కొయ్య హరీష్‌కు 593 మార్కులు వచ్చాయి. ఆర్.కంచేరు స్కూల్‌కు చెందిన ఎం.హర్షవర్దన్‌రెడ్డికి 584, మంజేరు స్కూల్‌కి చెందిన జ్యోత్స్నకు 581 మార్కులు వచ్చాయి.



మనిషికి నీరే ఇంధనం!



● నీరు తాగకపోతే వ్యాధుల ముప్పు

● వేసవిలో అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

రాజాం రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మోటారు వాహనానికి ఇంధనం ఎంత అవసరమో.. మానవ శరీరానికి తాగునీరు అంతే అవసరం. మంచినీటితోనే మానవ మనుగడ అంటున్నారు వైద్యులు. స్వచ్ఛమైన నీటికోసం రూ.వేలల్లో ఖర్చు చేయాల్సిన పనిలేదని... అందుబాటులో ఉన్న నీటిని శుద్ధి చేసుకుని తాగితే చాలా మేలని చెబుతున్నారు. జీవ ప్రక్రియకు అవసరమైన జలం శరీరంలో చేరి.. ఆరోగ్యంగా ఉండవచ్చన్నది వైద్యుల సూచన. ప్రధానంగా వేసవిలో శరీరంలోని నీరు అధిక మొత్తంలో చెమట, ఇతరత్రా రూపాలలో బయటకు పోతుంది. ఎప్పటికప్పుడు నీటిని భర్తీ చేయకపోయినా.. ఒక గ్లాసో, రెండు గ్లాసులో తాగేసి చాల్లే అనుకున్నా శరీరంలో కోట్లాదిగా ఉన్న చిన్న చిన్న కణాలకు నీరందక చనిపోతుంటాయని చెబుతున్నారు. ఫలితంగా మనిషి రోగాల బారిన పడక తప్పదంటున్నారు వైద్య నిపుణులు. ఎండలు మండిపోతున్నాయి. జిల్లా అంతటా వేడిగాలులు వీస్తున్నాయి. 35 నుంచి 40డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో నీరు తీసుకోవడం వల్ల కలిగే లాభాలు, తీసుకోకపోతే కలిగే అనర్థాలను పరిశీలిద్దాం.

జీవ రసాయన ప్రక్రియ కోసం..

మానవ శరీరం లక్షల కోట్ల కణాలతో నిర్మితమైంది. వీటికి అవసరమైన జీవ రసాయన ప్రక్రియ (బయో మెటాబాలిక్ ప్రాసెస్)లో కీలకపాత్ర వహించేది మంచినీరని అందరికీ తెలియకపోవచ్చు. శరీరంలోని మలినాలను బయటకు పంపడంతో పాటు కిడ్నీల పనితీరును మెరుగుపరిచేది నీరే. వాస్తవానికి ప్రతివ్యక్తి రోజుకు కనీసం అయిదు నుంచి ఆరులీటర్ల నీరు తాగితే శరీరంలోని ఆరోగ్య ప్రక్రియలన్నీ సజావుగా జరిగి రోగాలు దరిచేరకుండా ఉంటాయి. చాలామంది నీటిని తాగడానికి అంతగా ప్రాధాన్యం ఇవ్వరు. దీంతో అధికశాతం వేసవిలో డీహైడ్రేషన్, వడదెబ్బకు గురవుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

పొంచి ఉన్న అతిసార

రక్షితనీరు తాగకపోయినా, తక్కువగా నీరు తీసుకున్నా అతిసారకు గురయ్యే ప్రమాదం ఉంది. ఉదరకోశం, కణాలకు నీరు సక్రమంగా అందకపోవడంతో సంబంధిత కణాలు నిర్జీవంగా మారిపోయే అవకాశాలు ఎక్కువ. ఫలితంగా విరేచనాలు, వాంతులు కావడం సహజం. మనిషి నిస్సత్తువగా మారడం, స్పృహ కోల్పోవడం, కొన్ని సందర్భాలలో ప్రాణాల మీదకు వచ్చిన సంఘటనలూ కోకొల్లలు. తాగేనీటిలో ఇకోలై అనే బాక్టీరియా ఉన్నా అతిసారం సోకుతుంది.

జీర్ణప్రక్రియ వేగవంతం..

నీరు ఎంత ఎక్కువగా తాగితే శరీరానికి అంత మంచిది. వ్యాధులు దరిచేరే అవకాశాలు చాలా తక్కువ. ప్రజలలో నీటిని తాగడంపై పెద్దగా అవగాహన లేక డీహైడ్రేషన్‌కు గురవుతున్నారు. నీరు ఎక్కువగా తాగితే జీర్ణప్రక్రియ వేగవంతం అవుతుంది. ఐస్ వాటర్‌కు దూరంగా ఉంటే మంచిది.

- డా. పీఎల్ఎన్ రాజు (రఘు), రాజాం

కణవిచ్ఛిత్తి జరుగుతుంది

చర్మం మొదలు, మెదడు, ఎముకలు, ఊపిరితిత్తులు, కడ్నీ.. ఇలా ప్రతిభాగానికీ నీరు అవసరం. వాటికి సరిపడినంత నీరు అందకపోతే కణవిచ్ఛిత్తి (సెల్ డెడ్) జరుగుతుంది. ఫలితంగా డీహైడ్రేషన్‌కు గురై వాంతులు, విరేచనాలు కావడం, నిస్సత్తువగా మారి స్పృహ కోల్పోతారు. కాబట్టి నీరు ఎక్కువగా తాగాలి.

-డాక్టర్ గార రవిప్రసాద్, ఎం.డి, రాజాం

తాగిన నీరు ఏమవుతుందంటే..

● మనం తాగిన నీరు అన్నవాహిక ద్వారా జీర్ణాశయానికి చేరుతుంది.

● జీర్ణాశయం నుంచి పేగులకు చేరుతుంది. పేగుల గోడల్లో ఉండే కణాలు నీటిని పీల్చుకుంటాయి.

● అక్కడి నుంచి నేరుగా కాలేయానికి, జీవరసాయనిక ప్రక్రియ జరిగే రక్తనాళాల్లోనికి చేరి వాటిద్వారా శరీరంలోని ప్రతి కణానికీ అందుతుంది.

● కిడ్నీలు శుభ్రపరిచేందుకు నీరు ఉపయోగపడుతుంది. ● శరీరంలోని మలినాలు కొంత చెమట రూపంలో, మిగిలినవి మూత్రం రూపంలో బయటకు విసర్జించడంలో నీరు ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ● ఎక్కువ నీరు తీసుకుంటే శరీరంలోని ప్రతి భాగానికి అందడంవల్ల ఆరో గ్యంగా ఉండొచ్చు.

నీటికీ ఓ ప్రణాళిక..

భోజనం, అల్పాహారం విషయంలో ప్రణాళికాబద్ధంగా ఉన్నా.. తాగునీటి విషయంలో చాలా మంది అవేమీ పట్టించుకోరు. తాగునీటికీ ఓ ప్రణాళిక ఉందంటున్నారు వైద్యులు. అలా చేయగలిగితే ఆరోగ్యంగా ఉండవచ్చని చెబుతున్నారు.

● ఉదయం లేచిన వెంటనే అరలీటరు నుంచి లీటరు వరకు నీరు తాగాలి.

● టిఫిన్ తరువాత పావులీటరు తీసుకోవాలి. ● టిఫిన్‌కు, భోజనానికి మధ్యలో రెండుమూడుసార్లు లీటరు వరకూ తాగితే మంచిది. ● భోజనం తరువాత అరలీటరు తాగాలి. ● సాయంత్రం లోపు పావులీటరు నుంచి లీటరు వరకూ. ● రాత్రి భోజనానికి అరగంట ముందు అరలీటరు.● రాత్రి నిద్రపోయే ముందు అరలీటరు.

మనం తీసుకున్న పదార్థాలలో చాలామేరకు వేడిచేసి తయారు చేసినవే. ఫలితంగా వాటిలో రోగకారకాల సంఖ్య తక్కువగా ఉంటాయి. శుభ్రపరచని నీరు నేరుగా తాగితే అందులోని క్రిములు మనిషిని అనారోగ్యానికి గురి చేస్తాయి. శుద్ధ జలాన్ని కాచి.. మరిగించి చల్లార్చిన నీటిని గాని తాగితే మంచిది. ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా పచ్చకామెర్లు, విరేచనాలు, టైఫాయిడ్, పోలియో వంటి వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

● కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) విమానాశ్రయానికి వెళ్లే రహదారిలో రైతుల సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ అంబేడ్కర్ హామీ ఇచ్చారు. విమానాశ్రయానికి సంబంధించిన గూడెపువలస, రావివలస, అమటాం, సవరవిల్లి, దల్లిపేట, బైరెడ్డిపాలెం గ్రామాలకు చెందిన అప్రోచ్ రహదారిలో బుధవారం ఆయన పర్యటించారు. విమానాశ్రయానికి వెళ్లే అప్రోచ్ రోడ్డులో తమ పొలాల్లో రహదారి సౌకర్యం కల్పించాలని రైతులు, నాయకులు కోరారు. అప్రోచ్ రోడ్డుకు ఇరువైపులా భూమి ఎంత ఉందో కొలతలు వేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అప్రోచ్ రోడ్డు రహదారికి భూములు ఇచ్చినప్పటికీ కోరుట వివాదంలో పరిహారం అందలేదని నాయకులు మట్ట అయ్యప్పరెడ్డి, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, యర్రప్పల నారాయణ తదితరులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై అధికారులతో మాట్లాడి పరిహారం వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. గతంలో విమానాశ్రయం ఆర్ అండ్ ఆర్ కాలనీలకు ఇచ్చిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తయినప్పటికీ 22ఏలో ఉండడంతో బ్యాంకు రుణాలకు ఇబ్బంది పడుతున్నారని మార్కెఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో కీర్తి, తహసీల్దార్ సురేష్ తదితరులు ఉన్నారు.


పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

డీవీఈవోగా తవిటినాయుడు

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వృత్తివిద్యాశాఖ అధికారిగా ఎస్.తవిటినాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా బూర్జ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై జిల్లాకు వచ్చారు.

ఓపెన్ టెన్త్‌లో 23 శాతం ఉత్తీర్ణత

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన పది, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదల అయ్యాయి. ఓపెన్ టెన్త్‌కు సంబంధించి 295 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 136 మంది ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలోని జిల్లా 15వ స్థానం వచ్చింది. ఇంటర్మీడియట్‌కు సంబంధించి 1221 మంది రాయగా 563 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రంలోని జిల్లా 12వ స్థానంలో నిలిచింది.

దేవుని కనపాకలో సారా స్వాధీనం

గుర్ల/నెల్లిమర్ల ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవుని కనపాకలో బుధవారం సాయంత్రం 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరావు తెలిపారు. రెండు రోజుల నుంచి కొండల ప్రాంతంలో సారా వండుతున్నట్టు సమాచారంతో దాడుల నిర్వహించామన్నారు. ములగాపు లక్ష్మిని అరెస్టు చేసి, 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఎస్ఐ ఎం.నాగేశ్వరరావు, హెచ్‌సీలు ఎం.అప్పారావు, వి.కృష్ణ, పీసీలు పి.జయరాంనాయుడు, సౌజన్య పాల్గొన్నారు.

గ్రామదేవతల పండగ సందడి

కొత్తవలస, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామ దేవతల పండగలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కొత్తవలస పంచాయతీ చీపురువలసలో ముత్యాలమ్మ, తుమ్మికాపల్లిలో గ్రామ దేవత బంగారమ్మ పండగ లకు తొలేళ్ల ఉత్సవాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. తుమ్మికాపల్లిలో బంగారమ్మ పండగ సందర్భంగా ఉత్తరాంధ్ర జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించారు.

ఆటో కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

గరివిడి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గరివిడికి చెందిన ఆటో డ్రైవర్ పువ్వుల రమేష్(50) అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబానికి గరివిడి, చీపురుపల్లికి చెందిన మహాలక్ష్మి ఆటో వర్కర్స్ యూనియన్ బుధవారం రూ.12 వేల ఆర్థిక సాయం చేసింది. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు ఎం.రమణ, కె.సన్యాసిరావు, వి.అప్పన్న, డి.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న బంగార్రాజు

భోగాపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురైన పిన్నింటిపాలెం గ్రామానికి చెందిన కయతల మధుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.70వేలు మంజూరైంది. బుధవారం సంబంధిత చెక్కును పోలిపల్లిలో మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు బాధితుడిద కుటుంబానికి అందజేశారు.

ఘనంగా ఆలయాల ప్రారంభోత్సవం

కొత్తవలస, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కొత్తవలస పంచాయతీ గవరపాలెంలో సిద్ధి బుద్ధి సహిత మహాగణపతి, శ్రీసుబ్రహ్మణేశ్వర, శ్రీఅభయాంజనేయ, శ్రీసీతారామాలయ ప్రారంభోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వేదపండితుడు కప్పగంతుల ప్రసాద శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

20న విజయనగరంలో మహానాడు


నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు మే 20న నియోజకవర్గ స్థాయిలో మహానాడు నిర్వహణకు పార్టీ నాయకులు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పిలుపునిచ్చారు. టీడీపీ నగర, మండల పార్టీ నాయకులు, పార్టీ ముఖ్య నాయకులు, క్లస్టర్స్ సభ్యులతో బుధవారం పార్టీ కార్యాలయంలో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటా నిర్వహించిన విధంగానే నియోజకవర్గ స్థాయిలో భారీగా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. డివిజన్, గ్రామస్థాయిలో సమస్యలను తీసుకుని ఆయా సమస్యలను నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న మహానాడుకు నివేదించాలన్నారు. వేసవి నేపథ్యంలో 20న మధ్యాహ్నం 4 నుంచి రాత్రి 8 గంటల వరకూ పూర్తిగా పండుగ వాతావరణంలో మహానాడు నిర్వహించాలని నాయకులు, కార్యకర్తలు సూచించారు. మహానాడు కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర పరిశీలకులు కూడా రానున్నారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, బొద్దల నర్సింగరావు, కంది మురళీనాయుడు, అనురాధ బేగం, అవనాపు విజయ్, ముద్దాడ చంద్రశేఖర్, మైలిపిల్లి పైడిరాజు, గంటా రవి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

లక్కవరపుకోట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూర్మవరానికి రూ.30 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు బుధవారం ఎమ్మెల్యే లలిత కుమారి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాలకు కనెక్టివిటీ రోడ్లు నిర్మాణం చేపడతామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో రోడ్ల నిర్మాణం ఓ బ్లాండ్‌గా అమలవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కేబీఏ రాంప్రసాద్, కరెడ్ల ఈశ్వరరావు, కొల్లు రమణమూర్తి, చొక్కాకుల మల్లునాయుడు, కొట్యాడ ఈశ్వరరావుపాల్గొన్నారు.

అధికారులతో గ్రామాల్లో ఎమ్మెల్సీ పర్యటన


రేవళ్లపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు మండల అధికారులను బుధవారం తనతో పాటు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తీసుకు వెళ్లారు. రేవళ్లపాలెం, గోపాలపల్లి గ్రామాల్లో ఎంపీపీ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్సీ సూచించారు. అన్నిశాఖల అధికారులు కదిలివచ్చి సమస్యలను తెలుసుకోవడంపై గ్రామీణులు హర్షం వ్యక్తం చేశారు.

వక్ఫ్ బిల్లు ఆమోదం నూతన శకానికి నాంది


కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో వక్ఫ్‌బోర్డు సవరణ చట్టం బిల్లు ఆమోదించడం నూతన శకానికి నాంది పలికినట్టయిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ అన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు రాజేశ్వర్మ ఆధ్వర్యంలో వక్ఫ్ బోర్డు సవరణ చట్టంపై అవగాహన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ దశాబ్దాలుగా ముస్లింలోని కొన్ని వర్గాలకే పరిమితమైన వక్ఫ్ బోర్డు ఇకపై ముస్లిం మహిళలు వెనుకబడిన తరగతుల జాబితాలో ఉన్న ముస్లింలకు చోటు దక్కేలా రిజర్వేషన్ కల్పించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ ప్రతినిధులు రెడ్డి పావని, లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో శ్రీ ఆదిత్య విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అంబటి సత్తర్వు వద్ద గల శ్రీఆదిత్య ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చాటారు. 600 మార్కులకు గాను ఎం.పైడిలక్ష్మీభారతి 586, ఎం.శరణ్య 585, నగర ఆకాంక్ష 583 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ ఎ.ఉమానాయుడు మాట్లాడుతూ మొత్తం 41 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 12 మంది 550కు పైగా మార్కులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపాల్ కల్యాణి అభినందించారు.

కానిస్టేబుల్‌కు ఎస్పీ ప్రశంస


కానిస్టేబుల్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ

విజయనగరం క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వైఎస్సార్ నగర్ ప్రాంతంలో ఆత్మహత్యకు యత్నించిన బాలికను బుధవారం టూటౌన్ పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ జగదీశ్ కాపాడారు. ఇంట్లో తలుపులు వేసుకుని ఉరి వేసుకోవాలని బాలిక యత్నిస్తోందని డయల్ 112కు ఫిర్యాదు అందిన నేపథ్యంలో కానిస్టేబుల్ జగదీశ్ వెనువెంటనే స్పందించారు. ఘటనా స్థలానికి చేరుకుని సమయస్ఫూర్తితో వ్యవహరించారు. తలుపులు విరగ్గొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. అప్పటికే ఇంట్లో ఉరి వేసుకుని వేలాడుతున్న బాలికను స్థానికుల సాయంతో రక్షించారు. ఆత్మహత్యకు యత్నించిన బాలిక చదువును నిర్లక్ష్యం చేయడం, స్నేహితులతో ఎక్కువ సమయం గడుపుతున్నందున తల్లిదండ్రులు మందలించారు. దాంతో బాలిక ఆత్మహత్యకు యత్నించిందని గుర్తించిన టూటౌన్ పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. బాలికను రక్షించిన కానిస్టేబుల్‌ను ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించి ప్రశంసాపత్రం అందించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, టూటౌన్ సీఐ శ్రీనివాసరావు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడండి


పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న ఈఈ జ్యోతి

రాజాం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాజాం మున్సిపాలిటీలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని పబ్లిక్ హెల్త్ ఈఈ జ్యోతి అధికారులను ఆదేశించారు. బుధవారం రేగిడి మండలం సంకిలి సమీపంలోని ప్రధాన పంప్‌హౌస్‌ను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం రాజాం మున్సిపాలిటీలో తాగునీటి సరఫరా విషయంలో ఎటువంటి సమస్యలు లేవన్నారు. ఎప్పటికప్పుడు పంప్ హౌస్‌ను పరిశీలించి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాజాం పట్టణంలో జనాభా పెరుగుతున్నందున తాగునీటి సరఫరా సామర్థ్యం పెంచాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, ఏఈ పొన్నాడ వెంకటరామరాజు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ నిబంధనలు సులభతరం

రాజాం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నూతన భవన నిర్మాణాలకు ప్రభుత్వం నిబంధనలు సులభతరం చేసిందని విశాఖకు చెందిన ప్రాంతీయ ప్రణాళిక విభాగం రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ పి.నాయుడు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జె.రామప్పలనాయుడు సమక్షంలో రాజం మున్సిపాలిటీ, పాలకొండ నగర పంచాయితీ పట్టణ ప్రణాళిక అధికారులు, పట్టణ సర్వేయర్లు, ప్రణాళిక కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణాలకు నిబంధనలు సులభతరం చేసిన విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్లాన్ల అనుమతులను జాప్యం చేయవద్దన్నారు. సమావేశంలో రాజాం ప్రణాళిక అధికారి తేజేశ్వరరావు, సర్వేయరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

విజయనగరం క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): విజయగనం రైల్వే స్టేషన్ నాలుగో నెంబరు ప్లాట్‌ఫాం సమీపంలోని ట్రాక్‌పై గుర్తు తెలియని మృత దేహాన్ని గుర్తించినట్టు జీఆర్పీ హెచ్‌సీ వి.అశోక్ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 40 నుంచి 50 మధ్య ఉంటుందన్నారు. చామనఛాయ రంగు కలిగి లేత నీలిరంగు ఆఫ్ హ్యాండ్ టీ షర్టు, నలుపు ఫుల్ ప్యాం ట్ ధరించి ఉన్నట్టు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 94906 17089, 63013 65605 నెంబరును సంప్రదించాలని సూచించారు.

గుండెపోటుతో సర్పంచ్ మృతి

దత్తిరాజేరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమానాపురం సర్పంచ్ గొటివాడ దాను (55) బుధవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందాడు. ఒక్క సారిగా కుప్పకూలిన ఆయన్ని బంధువులు గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే సరికి మృతిచెందారు. మృతుడికి భార్య జయమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు.

ఉమా జూట్ మిల్లులో ఉత్పత్తి ప్రారంభం

కొత్తవలస, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మికాపల్లి పంచాయతీ సీతంపేటలో ఉన్న ఉమా జూట్ మిల్లులో బుధవారం నుంచి ఉత్పత్తి ప్రారంభమైంది. మిల్లు యాజమాన్యం విశాఖలోని జాయింట్ లేబర్ కమిషనర్‌కు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది. జూన్‌లో యాజమాన్యంమిల్లు లాకౌట్ విధించింది. పలుమార్లు కార్మిసంఘానికి, యాజమాన్యానికి చర్చలు జరిగాయి. అప్పట్లో జూట్ మిల్లులో లాకౌట్‌ను ఎత్తివేస్తామని మాట ఇచ్చారు. అందుకు తగ్గట్టు ఈనెల 10 నుంచి నిర్వహణ పనులు చేస్తామని 23 నుంచి ఉత్పత్తి ప్రారంభిస్తామని హామీ ఇచ్చింది. అందుకు తగ్గట్టు ఉదయం మిల్లు ప్రారంభమైంది. జూట్ మిల్లులో సుమారు 400 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం కార్మికులకు సంబంధించి పలు సమస్య పరిష్కారం అయినప్పటికీ కార్మికులకు సబంధించిన గ్రాట్యూటీ సమస్య పెండింగ్‌లో ఉంది. ఈ సమస్య కూడా త్వరలోనే పరిష్కారం కాగలదని కార్మిక సంఘం ఆశాభావం వ్యక్తం చేసింది.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

చీపురుపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని జి.అగ్రహారంలో భూ ఆక్రమణలకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆర్డీవో సత్యవాణికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆర్డీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. చీపురుపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సమీపంలో సర్వే నెం. 210/2లో 1.53 ఎకరాల గెడ్డ వాగును అదే గ్రామానికి చెందిన విసినిగిరి శ్రీనివాసరావు కబ్జా చేసి విక్రయించారని తెలిపారు. భూ ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్డీవోను కలిసిన వారిలో కొసిరెడ్డి రమణ, కె.మణికంఠ, కె.దాలయ్య, ఎస్.నారాయణరావు, పి.గణేశ్, ఆనంద్ తదితరులున్నారు.

పదో తరగతి పాస్‌కానన్న భయంతో..

● కొట్టక్కిలో విద్యార్థి ఆత్మహత్య


దుర్గాప్రసాద్ (ఫైల్)

రామభద్రపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్టక్కి గ్రామానికి చెందిన కర్రి దుర్గాప్రసాద్ (15) పదో తరగతిలో పాస్‌కానన్న భయంతో మంగళవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ వెలమల ప్రసాద్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. కొట్టక్కి పాఠశాలలో దుర్గాప్రసాద్‌పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాశాడు. బుధవారం విడుదలకానున్న ఫలితాల్లో ఫె యిల్ అవుతానని భయంతో ఉరివేసుకున్నాడు. దీంతో గమనించి బంధువులు హుటాహుటిన సాలూరు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. దుర్గాప్రసాద్ అమ్మమ్మ పెంటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.దుర్గాప్రసాద్ తల్లిదండ్రులు పార్వతీశం, పార్వతీ చెన్నై జీవనోపాధి కోసం వెళ్లారు. అమ్మమ్మ పెంటమ్మ దగ్గర అక్క తులసితో కలిసి దుర్గాప్రసాద్ ఉంటున్నాడు. కాగా దుర్గాప్రసాద్ బుధవారం విడుదలైన ఫలితాల్లో ఉత్తీర్ణత కాలేదని ఉపాధ్యాయులు తెలిపారు.

పోక్సో కేసులో ఒకరికి పదేళ్ల జైలు

బెలగాం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పోక్సో కేసులో ఓ వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష, రూ.రెండు వేల జరిమానా న్యాయాధికారి విధించారని ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. చినమేరంగి పోలీస్ స్టేషన్‌లో జియ్యమ్మవలస మండలంలోని కన్నపుదొర వలస గ్రామానికి చెందిన సామల నవీన్‌పై 2021లో పోక్సో కేసు నమోదయ్యింది. పోలీసుల విచారణలో ముద్దాయి నవీన్‌పై నేరం రుజువు కావడంతో విజయనగరం పోక్సో స్పెషల్ కోర్టు న్యాయాధికారి కె.నాగమణి శిక్ష ఖరారు చేశారని ఎస్పీ తెలిపారు.

దాడి కేసులో ముగ్గురికి రిమాండ్

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తవలసకు చెందిన మువ్వల రమణ కుటుంబ సభ్యులపై మద్యం మత్తులో దాడిచేసిన ముగ్గురు యువకులకు బుధవారం స్థానిక కోర్టు 14 రోజుల రిమాండ్ విధించిందని పట్టణ ఎస్ఐ గోవిందరావు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. పట్టణానికి చెందిన ఎస్.నారాయణరావు, పి. తరుణ్‌కుమార్, వై.జయంత్ కుమార్ మద్యం మత్తులో కొత్తవలసకు చెందిన మహిళ మువ్వల రమణపై ఈ ఏడాది ఫిబ్రవరి 2న దాడి చేసి గాయపరిచారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. నిందితులను అరెస్టు చేసి స్థానిక కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి 14 రోజుల రిమాండ్ విధించారన్నారు.

లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

జియ్యమ్మవలస, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మహిళపై లైంగిక దాడికి పాల్పడిన చినమేరంగి గ్రామానికి చెందిన సిరిపురపు నానిని చినమేరంగి ఎస్ఐ పి.అనీష్ బుధవారం అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. చినమేరంగి సీఐ టీవీ తిరుపతిరావు కథనం మేరకు.. ఓ వివాహితపై బ్లాక్ మెయిల్ చేస్తూ పలుపార్లు లైంగిక దాడికి పాల్పడిన సిరిపురపు నానిపై బాధితురాలు, ఆమె భర్త ఇటీవల ఫిర్యాదు చేశారన్నారు. నిందితుడిని బుధవారం అరెస్టు చేశామన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి ..

విజయనగరం క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మెరకముడిదాం మండలం గోపన్నవలసలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కోలా తిరుపతిని బుధవారం అరెస్టు చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఇందిరాదేవి తెలిపారు. అతడి నుంచి 13 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఎస్ఐ రమణ, హెచ్‌సీ శ్రీధర్, ఈసీలు నాయుడు, జనార్దన్ పాల్గొన్నారు.

తప్పుడు సాక్ష్యాలు సృష్టిస్తున్నారు..

● డీఎస్పీ విచారణపై గుడివాడ బాధితుల అసంతృప్తి

వేపాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వల్లంపూడి ఎస్ఐ బొడ్డు దేవిపై నమోదైన అట్రాసిటీ కేసు విచారణలో తప్పుడు సాక్ష్యాలను సృష్టించేందుకే విజయనగరం డీఎస్పీ వీరాకుమార్ యత్నిస్తున్నారని గుడివాడకు చెందిన బాధితులు గుడివాడ మోహన్, గుడివాడ కృష్ణమ్మ ఆరోపించారు. బుధవారం సాయంత్రం వేపాడలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్ఐపై నమోదైన అట్రాసిటీ కేసుపై విచారణకు ఉదయం 10 గంటలకు వల్లంపూడి చేరుకున్న డీఎస్పీ వీరాకుమార్ వల్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐ దేవి సమక్షంలో సాక్షులను విచారించారన్నారు. ఎస్ఐకు అనుకూలంగా సాక్ష్యం చెప్పించేందుకు గుడివాడ నుంచి రప్పించారన్నారు. ఎస్ఐ బొడ్డు దేవికి అనుకూలంగా సాక్ష్యం చెప్పించేందుకు తర్ఫీదు ఇచ్చారన్నారు. తర్వాత వారందరినీ పంచాయతీ కార్యాలయానికి తీసుకెళ్లి గుడివాడ మోహన్‌కు వ్యతిరేకంగా తప్పుడు సాక్ష్యాలను నమోదు చేశారన్నారు. ఎస్ఐ దేవి.. మోహన్‌పై దాడి చేస్తున్న వీడియో, ఫొటోలను సాక్ష్యాలుగా తీసుకోవాలని కోరినా డీఎస్పీ నిరాకరించారని తెలిపారు.

ఎస్ఐ దేవిపై క్రమశిక్షణ చర్యలు

వేపాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వల్లంపూడి ఎస్ఐ బొడ్డు దేవిపై బుధవారం సాయంత్రం ఎస్పీ వకుల్ జిందాల్ క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఎస్ఐ దేవిని వీఆర్‌కు ఆదేశించారు. ఆమె స్థానంలో కొత్తవలస ఎస్ఐగా కొనసాగుతున్న ఎన్.సుదర్శన్‌ను ఇక్కడకు బదిలీ చేశారు.

పెహల్గాం దాడి అమానుషం

విజయనగరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పెహల్గాంలో ఉగ్రవాదుల దాడి అమానుషమని, దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలని టీడీపీ సీనియర్ నేత కొండపల్లి కొండలరావు అన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 26 మంది అమాయక పర్యాటకులను ఉగ్రవాదులు హతమార్చడం దారుణమన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని ఆయన తెలిపారు.

నేడు విజన్ 2047పై అవగాహన

గజపతినగరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్రప్రదేశ్ 2047విజన్‌పై కలెక్టర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి అధికారులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహిస్తామని ఎంపీడీవో కల్యాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని శ్రీ కన్వెన్షన్ హాల్‌లో సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు.

కొవ్వొత్తులతో నివాళి

(ఆంధ్రజ్యోతి-బృందం)

కశ్మీర్‌లో పెహల్గాంలో ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ బుధవారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా కొవ్వొత్తులతో ర్యాలీలు జరిగాయి. ఉగ్రవాదుల దాడిని ఖండించారు. ఈమేరకు విజయనగరం, గజపతినగరం, నెల్లిమర్ల, డెంకాడ, రాజాంల్లో ర్యాలీలు నిర్వహించారు


గజపతినగరం: ర్యాలీలో జనసేన నేత పడాల అరుణ



నెల్లిమర్లలో బీజేపీ, జనసేన నాయకులు


రాజాంలో...


డెంకాడలో...

నిర్వహణ లేక.. ఆయకట్టుకు నీరందక

● మరమ్మతుకు నోచుకోని షట్టర్లు

● ఇదీ వెంగళరాయసాగర్ ఓపెన్‌హెడ్ చానల్ రెగ్యులేటర్ వద్ద పరిస్థితి

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలరాయుడుపేట, బట్టివలస వద్ద ఉన్న వెంగళరాయసాగర్ ఓపెన్ హెడ్ చానల్ రెగ్యులేటర్ నిర్వహణ లేకపోవడంతో శివారు ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందని పరిస్థితి నెలకొంది. షటర్లు పూర్తిగా పాడైనా ఏళ్ల తరబడి మరమ్మతులకు సైతం నోచుకోవడంలేదని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. బొబ్బిలి, సీతానగరం మండలాలకు సుమారు 25 వేల ఎకరాలకు సాగునీరందించే వెంగళరాయిసాగర్ ప్రధాన కాలువ నిర్వహణపై జలవనరులశాఖ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏటా ఖరీఫ్‌లో సైతం శివారు ఆయకట్టుకు నీరందడంలేదని రైతులు వాపోతున్నారు. దీనికితోడు దశాబ్దాల కిందట నిర్మించిన షట్టర్లు తుప్పుపట్టి పాడయ్యాయి. దీంతో నీరు మళ్లించడానికి అవకాశం లేకపోవడంతో వృథాగా పోతుంది. గతం వైసీపీ హయాంలో అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి షట్టర్ల మరమ్మతుల విషయాన్ని తీసుకువెళ్లినా ఫలితం లేకుండాపోయిందని రైతులు వాపోతున్నారు.



గోపాలరాయుడుపేట వద్ద పాడైన ఓపెన్‌హెడ్ చానల్ రెగ్యులేటర్

ఆదమరిస్తే అంతే..!

● పాలకొండ- రాజాం ప్రధాన రహదారిమార్గంలో పొంచిఉన్న ప్రమాదం

రేగిడి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంకిలి చెక్కర కార్మాగారం సమీపంలో గల పాలకొండ- రాజాం ప్రధానరహదారి మార్గంలో ప్రమాదం పొంచిఉంది. ఓ చోట కోతకు గురికావడంతో ఏ పాటు ఆదమరిచినా ప్రమాదం పొంచిఉందని వాహనచోదకులు, ప్రయాణికులు ఆందోళన చెందుతుతున్నారు. గొయ్యి వద్ద గతంలో ఒకరిద్దరు పడిపోయి గాయపడినట్లు స్థానికులు చెబుతున్నారు. పాలకొండ-విశాఖ ప్రధాన రహదారికావడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటుచేయలేదని పలువురు వాపోతున్నారు.



సంకిలి సుగర్స్ రోడ్డులో ప్రమాదపూరకంగా ఉన్న గొయ్యి

బాలికలదే పైచేయి

(ఒకటో పేజీ తరువాయి)

పెదిరెడ్ల భవ్యశ్రీకి 592 మార్కులు, బొబ్బిలి మండలం పక్కి జడ్పీ పాఠశాలకు చెందిన ఎస్‌కె లావణ్యకు 592 మార్కులు వచ్చాయి. వీరే కాకుండా మరి కొంతమంది విద్యార్థులు కూడా అత్యధిక మార్కులు సాధించారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు

జిల్లాలో 79 పాఠశాలల్లో శతశాతం ఫలితాలు వచ్చాయి.వీటిల్లో 55 ప్రైవేటుపాఠశాలలు, 14 జడ్పీ పాఠశాలలు, 4 కేజీబీవీలు, 4 బీసీ వెల్ఫేర్ స్కూల్స్, ఒక ఎయిడెడ్, ఒక ఏపీఆర్‌ఐ పాఠశాలల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాయి.

19 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

వచ్చే నెల 19వ తేదీ నుంచి 28 వరకూ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ఇప్పుడు ఉత్తీర్ణత కాని విద్యార్థులు ఈనెల 30వ తేదీలోగా అపరాధ రుసం లేకుండా ఫీజుచెల్లించాలి. వచ్చేనెల మొదటి నుంచి18వ తేదీ వరకూ రూ.50 రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. కాగా రీ కౌంటింగ్ కోసం(సబ్జెక్టు రూ.500), రీ వెరిఫికేషన్ కోసం (సబ్జెక్టుకు రూ.1000) చొప్పున ఈనెల నెల 24వ తేదీ నుంచి మే ఒకటిలోగా చెల్లించాలి.

ఏ కన్నూ చూడదనా..!

(ఒకటో పేజీ తరువాయి)

భూమిని కూడా వదలడం లేదు. నిబంధనల ప్రకారం రహదారులు, కాలువలూ ఉండవు.● అనధికార లేఅవుట్‌లకు రిజిస్ట్రేషన్లు చేయొద్దన్న నిబంధనలు ఉన్నప్పటికీ చిన్న చిన్న లొసుగులను అడ్డం పెట్టుకొని రిజిస్ట్రేషన్‌లు కానిచ్చేస్తున్నారు. నిర్మాణ అనుమతులకు చెల్లించాల్సిన రుసుం కంటే ఎక్కువ డబ్బులు చెల్లిస్తే అనుమతులు ఇచ్చేందుకు పంచాయతీ అధికారులు ముందుకు వచ్చేస్తున్నారు. సహజంగా లేఅవుట్‌ను తీర్చిదిద్దిన సమయంలోనే పంచాయతీ, రెవెన్యూ, వుడా అధికారులు అడ్డుకోవాలి. లేఅవుట్ తయారీకి ట్రాక్టర్‌లలో మట్టిని తీసుకువచ్చి పొలాల్లో వేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఫిర్యాదు వస్తే తాత్కాలికంగా ఆపుతున్నారు.

ముష్కరులను మట్టుబెట్టాలి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నాయకులు

బొబ్బిలి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):కాశ్మీర్‌లోని పహల్‌గామ్ ప్రాంతంలో ఉగ్రవాదుల తూటాలకు బలైన పర్యాటకులకు బొబ్బిలిలో జనసేన నాయకులు బుధవారం కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి మాట్లాడుతూ మతోన్మాదంతో మారణకాండకు తెగబడిన ముష్కరులను మట్టుబెట్టాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రమేష్, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

పోప్ ఫ్రాన్సిస్‌కు నివాళి

బొబ్బిలి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆంధ్రా ఇవాంజలికల్ లూథరన్ చర్చి డెలిగేట్ జేసీ రాజు ఆధ్వర్యంలో పోప్ ఫ్రాన్సిస్ మృతికి నివాళులర్పించారు. బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పోప్ చిత్రపటం ముందు కొవ్వొత్తులు వెలిగించి, క్రైస్తవ సమాజానికి పోప్ చేసిన ఆధ్యాత్మిక సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో చర్చి ప్రతినిధులుపీపీఏ మెర్సీ బాయ్, డేవిడ్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారాది శివారు వేగావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిపోతుండడంతో స్థానికుల సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు కె.రాంకుమార్ ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. ఈమేరకు యంత్రంతోపాటు రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. కేసు నమోదుచేయనున్నట్లు ఆర్‌ఐ తెలిపారు.

నేడు స్వర్ణాంధ్ర విజన్-2047పై శిక్షణ

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలో స్వర్ణాంధ్ర విజన్-2047పై గురువారం నియోజకవర్గ స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎం.శ్రీను ఒకప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, గ్రామస్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

గణితం మెటీరియల్ పంపిణీ

బొబ్బిలిరూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):నారసింహునిపేటలోని మూడు నుంచి తొమ్మిదో తరగతి వరకు గల విద్యార్థులకు గణిత మెటీరియల్‌ను బుధవారం ఉపాధ్యాయుడు ఎస్.రమేష్ ఆధ్వర్యంలో పంపిణీచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి మోహనరావు, పాఠశాల కమిటీ ఛైర్మన్, హెచ్‌ఎం ఎస్.రామారావు పాల్గొన్నారు.

ఇద్దరు బాలలకు సీఎం సహాయనిధి మంజూరు

బొబ్బిలి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్రకోటబొడ్డవలస గ్రామానికి చెందిన ఇద్దరు బాలలకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ.9,89,800లను ఎమ్మెల్యే బేబీనాయన మం జూరు చేయించారు. స్థానిక దర్బారు మహల్‌లో బొడ్డవలస గ్రామా నికి చెందిన కునుకు వెంకటరమణ మాట్లాడుతూ తమ కుమారుడు హర్షిత్ (13), కుమార్తె సహస్ర(8)లకు పుట్టుకతో వినికిడి లోపం ఉందన్నారు. గతంలో మాజీ మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు సౌజన్యం తో పిల్లలకు ఒకసారి సర్జరీ చేయించానన్నారు. మళ్లీ ఇప్పుడు బేబీనాయన చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి ఒక్కొక్కరికి రూ. 4.94 లక్షలు చొప్పున మంజూరు చేయిం చారని చెప్పారు. ఈమేరకు సీఎం కార్యాలయం నుంచి అధికారిక పత్రాలు అందాయని తెలిపారు.

పుస్తక పఠనంతో ఉజ్వల భవిష్యత్

బొబ్బిలి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):నేటి యువతకు ఉజ్వల భవిష్యత్ దక్కాలంటే పుస్తక పఠనం ఎంతో ముఖ్యమని యూటీఎఫ్ రాష్ట్ర నేత కె.విజయగౌరి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో జనవిజ్ఞానవేదిక ఆధ్వ ర్యంలో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం లైబ్రేరియన్ సవరపు స్వర్ణకుమారి అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్య క్రమంలో విజ యగౌరి మాట్లాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు శ్రీరామ్మూర్తి, శ్రీనివాసరావు, చిట్టిబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

విజయనగరం రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని స్టేడియం రోడ్డులోని బాల కేంద్రంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం నుంచి జూన్ 2 వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్టు కేంద్రం పర్యవేక్షకుడు బుర్రా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. శాస్త్రీయ గాత్ర సంగీతం, భక్తి సంగీతం, శాస్త్రీయ భరత నాట్యం, దేశభక్తి, జానపద నృత్యాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఐదేళ్ల నుంచి 16 ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు. వివరాలకు 94415 72195 నెంబరును సంప్రదించాలని ఆయన సూచించారు.

టీడీపీ బలోపేతానికి పనిచేయండి: మంత్రి

సాలూరు,ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలో పేతం కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం కావాలన్నారు. ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తే సహించే ప్రశక్తేలేదని తెలిపారు. బుధవారం మండలంలో ఎరగడవలస సమీపంలో ఓ తోటలో 29 పంచాయతీలకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు,నాయకులుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ,పంచాయతీ,మండల స్థాయి కమిటీలు వేయాలని కోరారు. కార్యక్రమం లో టీడీపీ మండలాధ్యక్షుడు ఆముదాల పరమేష్, అక్కేన తిరుపతిరావు, బసవయ్య, మత్స శ్యాం, మరిపి సింహాచలం, డొంక అన్నపూర్ణ, అప్పికొండ రమాదేవి పాల్గొన్నారు.

ఫిర్యాదులపై స్పందించండి

ప్రజల ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని, అధికారులు సమన్వయంలో పని చేయలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు.ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ, మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లె ప్రగతి, హరితహారం, పింఛన్లు, గృహనిర్మాణం, విద్యుత్, పాఠశాలలు ఆధునీకరణ పై దృష్టి పెట్టాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో పార్వతీ, తహసీల్దార్ రమణ పాల్గొన్నారు.

ఏ సమస్యకైనా తక్షణమే పరిష్కారం

● గుడ్ మార్నింగ్ పార్వతీపురం కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఏ సమస్యకైనా తక్షణమే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. బుధవారం ముని సిపాలిటీలోని 11, 12వార్డుల్లో గుడ్‌మార్నింగ్ పార్వ తీపురం కార్యక్రమంలో భాగంగా పర్యటించి, సమ స్యలు తెలుసుకున్నారు. వార్డుల్లో పారిశుధ్య నిర్వ హణ, తాగునీటిసరఫరాపై పలువురు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మునిసి పాలిటీని స్వచ్ఛ సుందర పార్వతీపురంగా తీర్చి దిద్ద డమే లక్ష్యమన్నారు.

కులగణన తర్వాతే రిజర్వేషన్ ప్రక్రియ జరగాలి

రాష్ట్రంలో ఎస్సీల కులగణన తర్వాతే రిజర్వేషన్ ప్రక్రియ జరగాలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా రెల్లి, వాటి ఉపకులాల సేవా సంఘం కన్వీనర్ జి.డేనియల్ కోరారు. స్థానిక ఇందిరాకాలనీకూడలిలో ఎమ్మెల్యే విజయచంద్రకు వినతిపత్రాన్ని అందజేశారు.

పదోన్నతులు కల్పించాలి

పార్వతీపురం రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించాలని జిల్లా వెలేర్ అసిస్టెంట్స్ సంఘం అధ్యక్షురాలు సిరిపురపు పద్మ, సెక్రటరీ కె.విద్యా సాగర్ కోరారు. క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు వినతిపత్రాన్ని ఉద్యోగులు అందజేశారు.

గిజబ గ్రామస్థులకు న్యాయం చేస్తాం

● కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి

గరుగుబిల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):చేపల చెరువు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి గిజబ గ్రామస్థులకు న్యాయంచేస్తామని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి హామీఇచ్చారు. బుధవారం తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో ముంపునకు గురైన గిజబ పునరావాస ప్రాంతాన్ని పరిశీలించారు. గ్రామానికి ఆనుకుని ఏర్పాటు చేసిన చేపల చెరువుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆమె దృష్టికి ఎంపీటీసీ ఎం.సింహాచలంనాయుడుతోపాటు పలువురు గ్రామస్థులు ఇటీవల తీసుకువెళ్లిన విషయం విదితమే. ఈమేరకు చెరువు పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె చేపల చెరువుతో అసౌకర్యం నెలకొన్న విషయాన్ని గుర్తిం చారు. చెరువు ప్రాంతాన్ని మార్పు చేసేందుకు అవసరమైన చర్యలు చేపడ తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ ప్రతినిధులు ఎ.మధుసూదనరావు, డి.రామకృష్ణ, రాంబాబు, ఎం.పురుషోత్తం నాయుడు, ఎం.తవిటినాయుడు, విజయవాంకుశం,పకీరునాయుడు, శంకరరావు పాల్గొన్నారు.

ఉగ్రవాద దాడి పిరికిపంద చర్య: ఎమ్మెల్యే

పాలకొండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పహల్గామ్‌లో పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడిని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఖండించారు. పర్యాటకులపై ఉగ్రదాడులు దాడిచేయం పిరికిపంద చర్యఅని పేర్కొన్నారు. బుధవారం పాలకొండలో విలేకరులతో మాట్లాడుతూ హిందువు అని నిర్ధారించుకొని మరీ వారిపై దాడి చేయడం అన్యాయమన్నారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు మూడురోజులపాటు సంతాప దినాలుగా నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు అప్పలనాయుడు, గండి రామినాయుడు పాల్గొన్నారు.

పంటలకు ధ్రువీకరణతోనే ప్రయోజనం

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పంటలకు గిట్టుబాటు ధర కల్పించడానికి పం టల ధ్రువీకరణ చేసుకోవాలని, అలాచేస్తేనే ప్ర యోజనం ఉంటుందని రైన్ ఫారెస్ట్ అలియన్స్ ప్రతినిధి రోజాచంద్ తెలిపారు. మండలంలోని గొరడలో ఆరు పంచాయతీల పరిధిలోగల 27 గ్రామాల్లో 563 మంది మాతోట రైతులు 500 ఎకరాలు మామిడి, రెండు వేల ఎకరాల జీడి, 50 ఎకరాల పసుపు పంటలకు ఆర్‌ఏ సర్టిఫికేషన్ చే యడానికి జట్టు వ్యవస్థాపకుడు డాక్టర్ నాయ కుడు అధ్యక్షతన మూడురోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా రోజాచంద్ మాట్లాడుతూ గతంలో నాబార్డు సహకారంతో మాతోట కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ విధానంలో పండించే పంటలు ఇతర రాష్ట్రాలు, దేశాల్లో విక్రయించుకోవడానికి అనుకూలంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి పి.షన్ముఖరాజు, శివాజీ, టి.శివకేశవరావు పాల్గొన్నారు.

సేవలను మెరుగుపరచాలి

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి భాస్కరరావు

జియ్యమ్మవలస, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో సేవ లను మరింత మెరుగుపరచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ భాస్కరరావు ఆదేశించారు. బుధవా రం కొమరాడ పీహెచ్‌సీని ఆక స్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలను వైద్యాధికారి అరుణ్‌కుమార్‌ను అడిగి తెలుసుకు న్నారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ (ఈ హెచ్‌ఆర్)పై సమీక్షించారు. అనంతరం ఓపీ, ల్యాబ్ రికార్డులను తనిఖీచేశారు. అలాగే ఇంప్లాంటబుల్ లూప్ రికా ర్డర్ (ఐఎల్‌ఆర్)ను, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు.

స్ప్రేయింగ్ శతశాతం జరగాలి

● జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం, ఏప్రి ల్ 23 (ఆంధ్రజ్యోతి): మలేరియా కేసులను నిరోధించేందుకు స్ప్రేయింగ్ శతశాతం జరిగేలా చర్యలు తీసుకో వాలని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్య నారాయణ కోరారు. బుధవారం మండలంలోని తాడికొండ, భద్రగిరి, నీల కంఠాపురం పీహెచ్‌సీల పరిధిలోని క్షేత్రస్థాయి సిబ్బందికి స్ప్రేయింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూమలేరియా నివారణా మందు పిచికారీపై ఓరియెంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ సిబ్బందికి అత్యవసరమని తెలిపారు.కార్యక్రమంలో మండలాభివృద్ధి అధికారి సాల్మన్‌రాజు, ఈవోపీఆర్డీ ధర్మారావు, సబ్‌యూనిట్ అధికారి మోహన్‌రావు, ఎంటీఎస్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

గ్రీన్‌గార్డు నియామకంపై విచారణ

గరుగుబిల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):మండలంలోని శివ్వాం పంచాయతీకి సంబంధించి గ్రీన్ గార్డు నియామకంపై బుధవారం విచారణ నిర్వహించారు. గ్రామానికి చెందిన పల్ల కృష్ణమూర్తినాయుడు కలెక్టర్‌కు గ్రీన్‌గార్డు విషయంపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదుచేశారు. ఈమేరకు కలెక్టర్ పార్వతీపురం డీఎల్‌పీవో ఎం.నాగభూషణరావును విచారణఅధికారిగా నియమించారు. శివ్వాం పరిధిలో రెండేళ్లుగా గ్రీన్‌గార్డు నియమించలేదని, గతంలో విధులు నిర్వహించిన వ్యక్తి విధులు నిర్వహించకుండాఉన్నారని, గ్రీన్‌గార్డుగా ఉంటూ మరో ఉద్యోగం చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒకే వ్యక్తి రెండు విధులు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. కాగా గ్రామస్థాయిలో పూర్తిస్థాయిలో సమాచారం సేకరిం చామని డీఎల్‌పీవో తెలిపారు. వాస్తవాలను పరిశీలించిచర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిస్తా మని చెప్పారు. అలాగే శివ్వాం పంచాయతీకి సంబంధించి పూర్తిస్థాయిలో రికార్డులు పరిశీలిస్తామని, రికార్డుల్లో తప్పి దాలు, దిద్దుబాట్లు నెలకొంటే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. కార్య క్రమంలో సర్పంచ్ రాయల పోలయ్య, అప్పారావు, రవి కుమార్ పాల్గొన్నారు.

రాయితీ పరికరాలు సద్వినియోగం చేసుకోవాలి

మక్కువ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ ద్వారా అందిస్తున్న రాయితీ పరిక రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సహాయ వ్యవ సాయ సంచాలకుడు ఎస్‌వీ రమేష్ కోరారు. మండలంలోని కొయ్యానపేట, కాశీపట్నం, కోన గ్రామాల్లో రైతులకు రాయితీపై అందించిన వరి నూర్పిడి యంత్రాలను బుధవారం తనిఖీ చేశారు. కార్య క్రమంలో ఏవో బొత్స శ్రీనివాసరావు, శివరామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ చూపండి: సీడీపీవో

సీతంపేట రూరల్, ఏప్రిల్ 23(ఆం ధ్రజ్యోతి):గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సీడీపీవో రంగలక్ష్మి సూచించారు. బుధవారం మండలంలో చిన బగ్గకాలనీ సెక్టార్‌లో పోషణ పక్వాడ్ కార్యక్రమంనిర్వహించారు.ఈసందర్భంగా గర్భిణులకు బలవర్ధకమైన పౌష్టి కా హారంఅందించాలని సూచించారు. అం గన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు.

లైఫ్ జాకెట్లు అందజేయాలి

పాచిపెంట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గిరిజన మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు, వలలు, బోట్లు పంపిణీ చేయాలని, పెద్దగెడ్డ జలాశయం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు జన్ని రామయ్య, కుడుమూరు భూపోరాట కమిటీ నాయకులు సూకురు అప్పలస్వామి, నిర్వాసిత మత్స్యకారుల సంఘం నాయకులు కోరారు. బుధవారం పెద్దగెడ్డ జలాశయం, గ్రీన్ ఫీల్డ్ హైవే రహదారిని పరిశీలించిన ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డీవీజీ శంకరరావు పరిశీలించారు.ఈ సందర్భంగా పలు గిరిజన సంఘాల నాయకులు సమస్యల వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన గిరిజన సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రమాదంలో మత్స్యకారులు మరణిస్తే రూ. 20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కుడమూరు 48 సర్వే నెంబరులో 782 ఎకరాలు సాగులో ఉన్నటువంటి 11 గ్రామాల గిరిజన రైతులకు సాగు పట్టాలు ఇవ్వాలని కోరారు. గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మానం వల్ల భూములు కోల్పోయిన మోదుగు పంచాయతీకి చెందిన బంగారుగుడ్డి, కాట్రగుడ్డి, బుచ్చింపాడు గ్రామాలకు చెందిన గిరిజనులకు నష్ట పరిహారం ఇవ్వాలన్నారు.

వంద రోజుల ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు

సాలూరు రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో వంద రోజుల ప్రణాళిక, జిల్లా కలెక్టర్, డీఈవోలు విద్యార్థుల సన్నద్ధతపై చూపిన ప్రత్యేక శ్రద్ధ వల్ల ఉత్తమ ఫలితాలు సాధ్యమైనట్టు డిప్యూటీ డీఈవో, సాలూరు ఎంఈవో బి.రాజకుమార్ తెలిపారు. బుధవారం సాలూరులో విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో గతేడాది ఫలితాలను నిలుపుకునేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపామన్నారు.

రోడ్డు విస్తరణపై సర్వే

వీరఘట్టం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలో పాలకొండ- పార్వతీపురం రహదారిలో బుధవారం వాహనాల సర్వే నిర్వహించారు. ఈరహదారి గుండా ఎన్ని వాహనాలు వస్తున్నాయి, ఏయే రకం వాహనాలు వస్తున్నాయని, ఏ ప్రాంతాలకు వెళ్తున్నాయి వాటి వివరాలు ఎన్ హెచ్ఏఐ సిబ్బంది, పోలీసుల సహకారంతో నమోదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే నిర్వహిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు

చిన్నచూపు తగదు

విజయనగరం రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): దేశంలో పలుచోట్ల బ్రాహ్మణ సామాజికవర్గంపై పలువురు చిన్నచూడడంపై బ్రాహ్మణ సేవాసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర అధికార ప్రతినిధి వీఎస్ఎస్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం విజయనగరంలోని కోట జంక్షన్‌లో గల వీరరాజేశ్వరస్వామి ఆలయంఎదుట బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రాహ్మణులను అవమానపరిచే విధానాలు తగవన్నారు. ఇటీవల జరిగిన సీఈటీ ప్రవేశ పరీక్షలకు హాజరైన బ్రాహ్మణ విద్యార్థులను మెడలోని యజ్ఞోపవీతాన్ని తీస్తే గానీ పరీక్షకు హాజరుకానివ్వమనే అధికారుల అమానుష చర్యను ఖండించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు శ్రీనివాస్, సరోజిని, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

ముష్కరుల దాడిని ఖండించండి

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ లోయలో ఉగ్రవాదులు మత చాందసవాదంతో దాడి చేసి ప్రాణాలను పొట్టన పెట్టుకోవడం తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేశ్‌వర్మ తెలిపారు. బుధవారం విజయనగరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముష్కరుల దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు.

యంత్ర పరికరాల పంపిణీ

విజయనగరం రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాకోడు, సారిక, దుప్పాడల్లోని రైతులకు బుధవారం వ్యవసాయ యంత్ర పరికరాలను బుధవారం వ్యవసాయ శాఖ ఏడీ నాగభూషణం, ఏపీ అగ్రోస్ డీఎం చంద్రశేఖర్ రైతులకు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి హర్షలత పాల్గొన్నారు.

ఘనంగా ఆంగ్ల భాషా దినోత్సవం

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మహారాజా స్వయం ప్రతిపత్తి కళాశాలలో బుధవారం అంతర్జాతీయ ఆంగ్ల భాష దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా కోరుకొండ సైనికస్కూల్ ప్రిన్సిపాల్ గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మాతృభాషతో పాటు ఆంగ్ల భాషను నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మహారాజా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. సాంబశివరావు, ప్రోగ్రాం సమన్వకర్త పి.నూకరాజు, ఆంగ్ల విభాగ సహాయ ఆచార్యులు జి.సన్యాసినాయుడు, కిరణ్మయి పాల్గొన్నారు.

7న ఆదివాసీ ఆత్మగౌరవ సభ

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం వైటీసీలోవచ్చే నెల ఏడో తేదీన ఆదివాసీ ఆత్మగౌరవసభ నిర్వహిస్తున్నామని ఆదివాసీ సంఘం ప్రతినిధులు తెలిపారు.ఈ మేరకు గుమ్మలక్ష్మీపురం సభ కరపత్రాలను బుధవారం విడుదల చేశారు.